9వ రోజుకు చేరుకున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు నిరవధిక సమ్మె

- ఏఐటీయూసీ యూనియన్ నుండి సంపూర్ణ సంఘీభావం ప్రకటించిన ఎన్ హెచ్ ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా.



వరంగల్ జిల్లా / వరంగల్ టౌన్ / అక్టోబర్ 21 / అక్షరం న్యూస్ –: వరంగల్ నగరంలోని పోచం మైదాన్ జంక్షన్ లో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేస్తున్న సమ్మె బుధవారం 9 వ రోజుకు చేరుకుంది. శిబిరంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ మరియు అవుట్సోర్సింగ్ ఉద్యోగుల నిరసన కార్యక్రమానికి ఏఐటియుసి సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగింది. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని, హెల్త్ కార్డ్ ,10 లక్షలు హెల్త్ ఇన్సూరెన్స్ ,మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చీకటిలో ఉన్నారని వెలుతురు తీసుకురావాలని పై డిమాండ్లకు తక్షణమే ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, పరిష్కరించే అంతవరకు సమ్మె ఆపే ప్రసక్తి లేదని ఉద్యోగులందరూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్. టి భరత్ కుమార్ హరికృష్ణ , డాక్టర్ సదానందం, డాక్టర్ హుస్సేన్ ,నర్సింగ్ ఆఫీసర్స్ కళ్యాణి , సుమలత, ఫార్మసీ ఆఫీసర్ తీగల సతీష్ కుమార్, ఎస్. అనిల్ కుమార్, సంతోష్, శివకుమార్, టీ.బి.డిపార్ట్మెంట్ రంజిత్ , రాకేష్, డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ మేనేజర్ మేర్గు అనిల్ కుమార్ , ఆడియోలజిస్ట్ వనజ, మెడికల్ సోషల్ వర్కర్ మండల లావణ్య, అప్రోమెటిక్ అమూల్య, ల్యాబ్ టెక్నీషియన్ మాధవి, ఏ.ఎన్.ఎం.లు పెనీన, దాసరి నర్మద ,రాజేశ్వరి, సంధ్య, ప్రభావతి, అనిత ,శ్రీలత, ఎం.ఎన్.ఓ. ఏకుల చిరంజీవి , అజ్మీర విజయ నాయక్ , బండి రాజేష్ మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముగిసిన రాధాకృష్ణ ఆలయ నవరాత్రి ఉత్సవాలు



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :. ఎన్ టి పి స ఏరియా కృష్ణ నగర్‌లోని రాధాకృష్ణ ఆలయంలో నిర్వహించిన దేవీ నవరాత్రి ఉత్సవాలు బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో, వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో పూజిస్తూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా సాయంత్రం దుర్గాదేవి విగ్రహాన్ని మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి వైభవంగా నిమజ్జనానికి తరలించారు. అమ్మవారికి వీడ్కోలు పలికే సమయంలో భక్తులు భక్తిపారవశ్యంతో అమ్మవారిని స్మరిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళలు సంప్రదాయ, రంగురంగుల దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు.అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు వేణుమాలని సురేష్ తదితరులు సమన్వయంతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని నవరాత్రి ఉత్సవాలను భక్తిమయ వాతావరణంలో ముగించారు.

ఓదెల దుర్గామాతను దర్శించుకున్న మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్



పెద్దపల్లి ఓదెల అక్టోబర్ 21 అక్షరం న్యూస్

ఓదెల: గ్రామంలోని దుర్గామాతను మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ మంచి జరగాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా అమ్మవారి మండపం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అమరవీరుల త్యాగాలే పోలీస్ శాఖకు స్ఫూర్తి



- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఘన నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 21 / అక్షరం న్యూస్ –:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అమరవీరుల స్తూపం వద్ద విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సాయుధ పోలీసులు "శోక్ శస్త్ర" నిర్వహించి అమరవీరులకు గౌరవ వందనం సమర్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల పాటు మౌనం పాటించి వీరమరణం పొందిన పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. గత ఏడాది నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల పేర్లను ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ చదివి వినిపించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తూ, విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైన్యంతో జరిగిన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీస్ సిబ్బంది త్యాగాలకు గుర్తుగా 1962 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు.2025 సెప్టెంబర్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా స్మరించుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు పోలీస్ సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు.దేశ భద్రత, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఉగ్రవాదం, నక్సలిజం వంటి సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది సేవలు అభినందనీయమని అన్నారు.అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొని అమరవీరుల స్తూపం వద్ద విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు.







సమాజంలో దుష్ట శక్తులను రూపుమాపాలి





- విజయదశమి ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలి.
- శాంతి, సామరస్యాలతో ముందుకు సాగుదాం.
- ఐక్యతతోనే ప్రగతి సాధ్యమవుతుంది.
- చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసర పండుగ.

కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 21 / అక్షరం న్యూస్ –: : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం పట్టణ పరిధిలోని రైటర్ బస్తీతో పాటు రామవరంలోని అంబేద్కర్ చమన్ వద్ద సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక జమ్మి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా రావణాసురుడి దిష్టిబొమ్మ దహన (రావణ వధ) ఘట్టాన్ని లాంఛనంగా ప్రారంభించారు. బాణసంచా వెలుగుల నడుమ రావణ వధను వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన అశేష జనవాహినిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. సమాజంలో నెలకొన్న అసమానతలు, అన్యాయాలు, చెడు ఆలోచనలను అంతమొందించి ధర్మమార్గాన్ని అనుసరించడమే దసరా పండుగ ఇచ్చే అసలైన సందేశమని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి ధ్యేయంగా ప్రజలంతా కలసికట్టుగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు, కార్మికులకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సింగరేణి గుర్తింపు సంఘం నాయకులు వంగ వెంకట్, రమణమూర్తి, జె గట్టయ్య, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, మునిగడప పద్మ, ధర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.



పుణ్యపురంలో వైభవంగా బతుకమ్మ ముగింపు వేడుకలు..



ఖమ్మం/వైరా అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

వైరా మండలం పుణ్యపురం గ్రామంలో బతుకమ్మ సంబరాల ముగింపు వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా ముగిశాయి. 9 రోజులపాటు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా సాగిన సంబరాల ముగింపు వేడుకలో గ్రామ ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ మహిళా పెద్దలు, యువతులు రంగురంగుల తంగేడు పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సాయంత్రం వేళ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలోని కమిటీ హాల్ ఎదురుగా జీవరత్నం ఆధ్వర్యంలో చేరుకున్నారు. బతుకమ్మల చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ, సాంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు. దీంతో గ్రామంలో పండగ వాతావరణం సంతరించుకుంది.అనంతరం మహిళలందరూ బతుకమ్మలను తలపై ఎత్తుకుని మంగళ హారతులు, దప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా స్థానిక గ్రామ శివారు ఏటి వద్దకు చేరుకున్నారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. "బొయ్యిరా బతుకమ్మ.. పోయిరా గౌరమ్మ.. మళ్లీ ఏడాదికొచ్చి మమ్మల్ని దీవించు" అంటూ భక్తి శ్రద్ధలతో బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసి సాగనంపారు.ఈ వేడుకలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు, యువకులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో గద్దల స్వామి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ యంగల మరియమ్మ, భర్త కృష్ణయ్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌కు దసరా

శుభాకాంక్షలు తెలిపిన బాన్సువాడ బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి --
- గ్రామస్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని నాయకుల పిలుపు



బాన్సువాడ / అక్టోబర్ 21 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

దసరా పండుగను పురస్కరించుకుని బాన్సువాడకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్, సీనియర్ నాయకుడు సాయి బాబా, మాజీ వార్డు సభ్యుడు అక్బర్ తదితరులు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని వేల్పూర్‌లో కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో పాటు ఆయన కుమారుడు అజయ్ బాజిరెడ్డిని కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌లు బాన్సువాడ నుంచి వచ్చిన క్రియాశీలక నాయకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలు చేస్తున్న కృషిని అభినందించారు. గ్రామస్థాయి నుంచి బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలిరాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని గ్రామగ్రామాన మరింత బలోపేతం చేయాలని, ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను విస్తృతంగా వివరించాలని నాయకులకు సూచించారు. ముఖ్యంగా రైతులు, పేదలు, సామాన్య ప్రజలకు గత ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలియజేయాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వ హామీలు, అమలులో ఉన్న లోపాలు, అమలుకాని పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పంటలకు కలుగుతున్న నష్టాల విషయంలో రైతులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం కల్పించాలి

బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేస్తూ, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని నాయకులు సూచించారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని ప్రజల్లో కల్పించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ దసరా పండుగ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలని సంకల్పించారు. సాయి బాబా బాడీ శ్రీను, షఫీ, ఫెరోజ్, ఖలీల్, ఇసాక్, రామ్ చందర్, మాకబుల్ , తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వరావుపేట మరియు లయన్స్ కంటి హాస్పిటల్ వైరా వారి ఆధ్వర్యంలోకంటి వైద్య శిబిరం..

- శిబిరాన్ని ప్రారంభించిన అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- శిబిరాన్ని సందర్శించిన..మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు



ఖమ్మం/ వైరా అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వరావుపేట మరియు వైరా లయన్స్ కంటి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అదేవిధంగా:- మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు కంటి సంబంధిత సమస్యలను గుర్తించి, తగిన వైద్య సలహాలు పొందేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను వారు అభినందించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి. రవిచంద్ర, కంటి పరీక్ష నిర్వహించి, కంటి ఆపరేషన్లను గుర్తించారు. అదేవిధంగా: లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఐ హాస్పిటల్ నిర్వాహకులు లయన్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు డాక్టర్ రవిచంద్ర కంటి ఆస్పత్రి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్కినేని నరేంద్రబాబు, సెక్రటరీ బాలమూరి సూర్యరావు, ట్రెజరర్ జూపల్లి బ్రాహ్మరావు , లయన్స్ క్లబ్ సభ్యులు, లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓదెలలో ఘనంగా దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి వీడ్కోలు.. ఆటపాటలతో మార్మోగిన వీధులు



పెద్దపల్లి ఓదెల అక్టోబర్ 21 అక్షరం న్యూస్

ఓదెల మండల కేంద్రంలో దుర్గామాత నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి, భక్తుల జయజయధ్వానాల మధ్య నిమజ్జనానికి ఊరేగింపుగా బయలుదేరారు. డప్పుచప్పుళ్లు, భక్తి గీతాలు, ఆటపాటలతో సాగిన ఈ శోభాయాత్ర గ్రామ వీధుల్లో ఉత్సాహభరిత వాతావరణాన్ని నింపింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుంటూ, మొక్కులు చెల్లించుకుంటూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. మహిళలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమ్మవారికి వీడ్కోలు పలుకుతూ భక్తులు చేసిన జయజయధ్వానాలతో ఓదెల మండల కేంద్రం మార్మోగింది. దుర్గామాత ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. భక్తి, సంప్రదాయం, ఐకమత్యానికి ప్రతీకగా నిలిచిన దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపింది.

టీపీసీసీ వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లును సన్మానించిన జర్నలిస్టులు..



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన ఖమ్మంజిల్లా తల్లాడ మండలంలోని కృష్ణాపురం గ్రామానికి నారపోగు వెంకటేశ్వర్లును తల్లాడ జర్నలిస్టులు సన్మానం చేశారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని స్వగ్రామానికి వచ్చిన ఆయనను బుధవారం తల్లాడ జర్నలిస్టులు కలిసి స్వీట్లు తినిపించి శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా పలు విషయాలు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు దేవబత్తిని సీతారాములు, గొడ్ల బాబురావు, కాంపాటి రవి, గొడ్ల నరసింహారావు, గొల్లమండల ప్రేమ్ కుమార్ ఉన్నారు.

అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు ఉచిత మందుల పంపిణీ

- ప్రత్యేక పూజలు పాల్గొనిఅమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలి
- అమెరికా డాక్టర్ నేరెళ్ల దామోదర్



కరీంనగర్/జమ్మికుంట/ అక్టోబర్ 21/అక్షరం న్యూస్:

జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో ఇండియన్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలోని దుర్గామాత అమ్మవారి సన్నిధిలో శివాలయం దగ్గర చిన్నపిల్లలకు ఉచిత మందుల పంపిణీ కార్యక్రమంనిర్వహించారు. అమెరికా డాక్టర్ నేరెళ్ల దామోదర్ చేతుల మీదుగా చిన్నపిల్లలకు (0-16) సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మడిపల్లి గ్రామంలో గతంలో కూడా పెద్ద ఎత్తున అన్ని రకాల స్పెషలిస్ట్ వైద్యులచే అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు ఎంత ఎత్తుకు ఎదిగిన మూలాలు మర్చిపోకుండా పుట్టిన ఊరు పై ఉన్న మమకారంతో అమెరికా నుండి వచ్చి చిన్న పిల్లలకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వేద పండితులు రాజగోపాల్ ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారికి అర్చనలు ప్రత్యేక పూజలు చేశారుఈ సందర్భంగా డాక్టర్ నేరెళ్ల దామోదర్ మాట్లాడుతూ పుట్టి పెరిగిన ఊరుని ఎప్పుడూ మరిచిపోనని గ్రామానికి వైద్య పరంగా కానీ ఏ ఇతర మౌలిక అవసరాలకు గాని తన వంతు సహాయ సహకారాలు అందిస్తాననితెలిపారుదుర్గామాత ఆశీస్సులతో గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని పాడి పంటలతో సిరి సంపదలు కలగాలని ప్రార్థించారుభక్తి భావంతో నిర్వహించిన పూజలతో అమ్మవారి సన్నిధిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పోషిని సత్యనారాయణ శ్రీ దుర్గ భవాని అసోసియేషన్ సభ్యులు భవాని స్వాములు,భక్తులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన .. రెడ్డిగూడెం సర్పంచ్ మోదుగు తిరుమలరావు



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

తల్లాడ మండల పరిధిలోని పరిధిలోని రెడ్డిగూడెం గ్రామం నందు అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రుల మండపం వద్ద ఈరోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమాన్ని రెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ మోదుగు తిరుమలరావు ప్రారంభించారు. అదేవిధంగా:- నవరాత్రి పూజలు నిర్వహించిన అర్చకులను సర్పంచ్ ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంపల్లి వెంకటేశ్వర్లు, గ్రామ ప్రజలు, గ్రామ నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ను మర్యాదపూర్వం కలిసిన మార్కెట్ యార్డ్ నూతన కార్యదర్శి నరేష్ కుమార్



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

వైరా: వైరా వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన

కార్యదర్శి ఈ. నరేష్ కుమార్ బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు తో కలిసి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ని, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఈ. నరేష్ కుమార్ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ని, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ని శాలువాలతో సత్కరించారు .ఈ కార్యక్రమంలో వైరా వ్యవసాయ మార్కెట్ యార్డ్ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేష్ రావు తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆకుల వెంకటేశ్వర్లుకు నివాళులు ..



ఖమ్మం టౌన్ అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

దంసలాపురము మాజీ సర్పంచ్ ఆకుల వెంకటేశ్వర్లు అకాలమరణం పట్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు, మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు, ట్రస్ట్ బోర్డర్ కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య, నగర కార్యదర్శి బైరిశెట్టి శ్రీనివాసరావు , గుండ పనేని నాగేశ్వరరావు, బండారు రామ కృష్ణ శ్రద్ధాంజలి ఘటించారు . వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చాలని నివాళులు అర్పించారు. అనంతరం వారి కుమారుడు సుందరయ్య, వారి తమ్ముళ్ళు, కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియచేసారు.

రేషన్ షాపుల్లో 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి..సీపీఎం

- సీపీఎం తల్లాడ మండల కమిటీ డిమాండ్



ఖమ్మం/తల్లాడ అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

తల్లాడ: స్థానిక దొడ్డ కృష్ణయ్య భవనంలో సీపీఎం తల్లాడ మండల కమిటీ సమావేశం నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావంతో రైతులు, వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు వాటిని కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ముఖ్యంగా బియ్యం ధరలు పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మధ్యవర్తుల కారణంగా బియ్యం ధరలు పెరుగుతున్న పరిస్థితులపై ప్రభుత్వాలు దృష్టి సారించి, ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా తగిన విధానాలను రూపొందించి పేదలకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాలను కోరారు.ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, సత్తెనపల్లి నరేష్, చల్లా నాగేశ్వరరావు, ఆదూరి జీవరత్నం, గండమల ఆనందరావు, మేడి బిక్షం, అనుమూల కృష్ణయ్య, పేరసాని వెంకటయ్య, కట్ట దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం రోజున వైరా పోలీసులు వృద్ధులకు పండ్ల పంపిణీ..



ఖమ్మం/వైరా అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

వైరా: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైరా మండలం గొల్లపూడి గ్రామంలోని వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు వైరా ఎస్ ఐ పుష్పాల రామారావు పండ్లు పంపిణీ చేశారు. సమాజ శ్రేయస్సు కోసం, ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వం, ప్రేమ, ఆప్యాయతతో వ్యవహరించాలని, ఆపన్నులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి సర్పంచ్ మేడూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లగూడెంలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు..

- కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న మాజీ సర్పంచ్ నారపోగు వెంకట్.
- వీడీసీ చైర్మన్ కోడూరి వీర కృష్ణ దిశా నిర్దేశంలో ఘన ఏర్పాట్లు .
- సర్పంచ్ కోడూరి ఉమాదేవి నేతృత్వంలో కదిలిన ఆడ పడుచులు.



ఖమ్మం/తల్లాడ/ అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబరాలు గొల్లగూడెం గ్రామ పంచాయతీలో అంబరాన్నంటేలా జరిగాయి.గ్రామ సర్పంచ్ కోడూరి ఉమాదేవి వీరకృష్ణ నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకలు మహిళల ఆటపాటలు, బతుకమ్మల సందడి మధ్య పండుగ శోభను సంతరించుకున్నాయి. ఈ సంబరాల్లో గ్రామ వీడీసీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సంఘ నాయకులు కోడూరి వీర కృష్ణ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.గ్రామాభివృద్ధికి దిశానిర్దేశం, వేడుకల్లోనూచురుకైన భాగస్వామ్యం గొల్లగూడెం గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పాటు గ్రామాభివృద్ధి అంశాల్లోనూ కోడూరి వీర కృష్ణ పోషిస్తున్న పాత్రపై గ్రామంలో చర్చ జరుగుతోంది. ఆయన నేతృత్వంలో గ్రామ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. గ్రామ ప్రజలను ఐక్యంగా ముందుకు నడిపిస్తూ, సంప్రదాయ పండుగలు, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం గ్రామంలో పండుగ వాతావరణాన్ని మరింత పెంచింది.సద్దుల బతుకమ్మ వేడుకలు తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు,మన సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనానికి ప్రతీకగా నిలిచాయి. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. గ్రామంలోని మహిళలు, యువతులు, విద్యార్థినులు, విద్యార్థులు, యువకులు,గ్రామ ప్రజల భాగస్వామ్యంతో వేడుకలు వైభవంగా సాగాయి.గొల్లగూడెం గ్రామంలో సాంస్కృతిక సంప్రదాయాలను కాపాడుతూ,ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలనే ఆకాంక్ష ఈ వేడుకల్లో ప్రతిబింబించింది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారపోగు వెంకట్, ఉపసర్పంచ్ తోటపల్లి నాగలక్ష్మి,మాజీ ఎంపీటీసీ ఇలాసాగరం మణిమ్మ,వీడీసీ చైర్మన్ కోడూరి వీర కృష్ణ,ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఇస్సపల్లి అశోక్, గ్రామ పెద్దలు, మహిళలు,విద్యార్థినీ విద్యార్థులు, యువకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దగ్గుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా బోనాల వేడుకలు..



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

తల్లాడ పట్టణంలో దగ్గుల శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులందరూ కలిసి బోనాలు ఎత్తుకొని కోట మైసమ్మ తల్లికి సమర్పించారు. దేవి శరన్నవరాత్రి దసరా ఉత్సవాల్లో భాగంగా దగ్గుల కుటుంబ సభ్యులందరూ ఒక్కటై బోనాలు ఎత్తుకొని కార్యక్రమం నిర్వహించారు. కోట మైసమ్మ ఆలయ చైర్మన్ లగడపాటి నెహ్రూ సహకారంతో దగ్గుల కుటుంబ సభ్యులు ఆలయానికి చేయూతగా అండగా ఉంటూ ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో దగ్గుల నరసింహారెడ్డి, దగ్గుల అప్పిరెడ్డి, దగ్గుల శివారెడ్డి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, మహిళలు కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ సంబరాలు..

- మహిళా ఆటపాటలతో పండుగ వాతావరణం. సర్పంచ్ కోడూరు ఉమాదేవి వీర కృష్ణ.



ఖమ్మం/తల్లాడ అక్టోబర్ 21(అక్షరం న్యూస్)

తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, పూల పండుగ వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను ఆనందంగా పేర్చి, సాంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా కోలాట సంబరాలు జరుపుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ కీలక పాత్ర పోషిస్తుందని ఆడపడుచుల ఐక్యతకు, ప్రకృతిపై, ప్రేమకు మన సంస్కృతిపై ఉన్న అభిమానానికి నిదర్శనమని తెలిపారు. బతుకమ్మ పాటలతో కోలాటాలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. కిష్టాపురం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనేలా మహిళలందరూ ఐక్యంగా బతుకమ్మ వేడుకలలో పాల్గొనేలా వేడుకలను ఘనంగా నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ సాంప్రదాయాలను కాపాడుతూ గ్రామీణ సంస్కృతిని ముందుకు తీసుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని కిష్టాపురం గ్రామ ప్రజల అభిప్రాయపడ్డారు.

బోనాలు ఎత్తుకున్న ఎంపీడీవో గోపిశెట్టి సుస్మిత..



ఖమ్మం/తల్లాడ అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

తల్లాడ పట్టణానికి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి గోపిశెట్టి సుస్మిత బుధవారం తల్లాడలో బోనాలు ఎత్తుకొన్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక కోట మైసమ్మ ఆలయంలో ఆమె బోనాలు సమర్పించారు. ఇంటి వద్ద నుండి తన తల్లిదండ్రులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, విజయమ్మ దంపతులతో కలిసి బోనాలు ఎత్తుకొని ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

పూలను పూలతో పూజించే గొప్ప పండుగ బతుకమ్మ..

- ఆటపాటలతో సంబరాలు చేసుకున్న మహిళా మణులు..
- ఆకట్టుకున్న వివిధ రూపాలలో ఉన్న బతుకమ్మలు.



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)

తల్లాడ మండలం రామానుజవరం గ్రామంలో బొడ్రాయి సెంటర్ వద్ద మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీశీలం కోటారెడ్డి శివపార్వతి దంపతులు ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఆటపాటలతో, డీజే నృత్యాలతో మహిళా మణులు ఆడి పాడారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలను పూలతో పూజించే అతి పెద్ద పండుగ బతుకమ్మ అని ఆడపడుచులు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు...ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శీలం శివపార్వతి, రామానుజవరం సర్పంచ్ కిన్నెర వెంకట కృష్ణవేణి, ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ ,వార్డు సభ్యులు, గ్రామస్తులు మహిళలు చిన్నారులు పాల్గొన్నారు...

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తలకు తీవ్ర గాయాలు

- ముల్కనూర్ ఎల్లమ్మ గుడి బ్రిడ్జి వద్ద ప్రమాదం..



హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ అక్టోబరు 21/అక్షరం న్యూస్:-
ముల్కనూర్‌లోని ఎల్లమ్మ గుడి బ్రిడ్జి వద్ద బుధవారం సాయంత్రం కారు ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో రాజేందర్ అనే వ్యక్తికి తలకు తీవ్ర గాయాలయ్యాయి.స్థానికుల వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి చెందిన కొమ్ముల ప్రణయ్ కారులో ముల్కనూర్ వైపు వెళుండగా రాజేందర్ ద్విచక్ర వాహనంపై కొప్పూర్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎల్లమ్మ గుడి బ్రిడ్జి వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న రాజేందర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించి. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.రాజేందర్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

1మున్నూరు కాపు సంఘం నాయకులు సమావేశం..

- మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ కు 50 లక్షలు నిధులు మంజూరు..
- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)
మున్నూరుకాపు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం అధ్యక్షతన మున్నూరుకాపు ముఖ్యులు మున్నూరు కాపు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు , రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ను వారి నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసి ముఖ్య విషయాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు స్పందించి పెండింగ్ లో ఉన్న మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ నిర్మాణం గురించి ఎంపీ నిధులనుండి వచ్చినటువంటి 50 లక్షల రూపాయల నిధులను వెంటనే విడుదల చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ని కోరారు. దానికి కలెక్టర్ వెంటనే సానుకూలంగా స్పందించి నిధుల విడుదల కు అంగీకారం తెలిపారు . అంతేకాకుండా రవిచంద్ర 6 నెలల లో ఫంక్షన్ హాల్ నిర్మాణం జరగాలని సూచించారు . అవసరమైతే నిధులు సరిపోని పక్షం లో కావాల్సిన నిధులు అందజేస్తానని హామీ ఇవ్వడం జరిగింది . అదేవిధంగా జిల్లా నూతన కార్యవర్గ సమావేశాన్ని కూడా ఈ నెల 28 న మున్నూరు కాపు హాస్టల్ నందు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం కు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ని మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు మరియు ఖమ్మం జిల్లా ఇంచార్జి ని ముఖ్య అతిధులు గా రావాలని కోరారు. అంతేకాకుండ వచ్చే నెల కార్తీక మాసం నవంబర్ 15 న ఆదివారం నాడు మున్నూరుకాపు వనసమారాధన నిర్వహించాలని తీర్మానం చేశారు. తదుపరి ఖమ్మం నగరం కొత్తగూడెం సమీపంలో గల చెరుకూరి మామిడి తోట ను పరిశీలించారు. మామిడి తోట ను నిర్ణయించడం జరిగింది . ఈ కార్యక్రమం లో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ , జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తా సీతారాములు , గౌరవ సలహా దారులు పొదిల రవి కుమార్ , పారా నాగేశ్వరరావు , మెంతుల శ్రీశైలం , పసుపులేటి నాసరయ్య , మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం , ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్ , కోశాధికారి మడూరి పూర్ణ , మున్నూరు కాపు ప్రముఖులు తాళ్లూరి హనుమంతరావు , జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాసరావు , జిల్లా ఉపాధ్యక్షులు మాటేటి నాగేశ్వరరావు , జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం నాగేశ్వరరావు , ఖమ్మం నగర అధ్యక్షులు పారా ఉదయ్ , నగర కోశాధికారి , జివివిఎల్ .నరసింహరావు , జిల్లా యూత్ ఉపాధ్యక్షులు నానబాల హరీష్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలశెట్టి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన ఊరికి సేవే నిజమైన గౌరవం!





- ఇందుర్తి గ్రామానికి రూ.2.80 లక్షల విలువైన వైకుంఠ రథం బహూకరణ
- తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రాగి నాగరాజు--సరిత దంపతుల ఉదారత
- ప్రతి అంతిమ యాత్రకు రూ.500 డీజిల్ సాయం

చిగురుమామిడి/ అక్టోబర్ 21,
పుట్టిన ఊరిపై మమకారం, సమాజంపై బాధ్యత, కష్టకాలంలో ఉన్నవారికి అండగా నిలవాలనే సంకల్పం.. ఈ మూడు కలిస్తే సేవకు సరికొత్త నిర్వచనం లభిస్తుంది. ఇందుకు నిదర్శనంగా నిలిచారు హనుమకొండ ప్రాంతానికి చెందిన రాగి నాగరాజు -- సరిత దంపతులు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామ ప్రజల సౌకర్యార్థం రూ.2.80 లక్షల విలువైన వైకుంఠ రథాన్ని బహూకరించి తమ ఉదారతను చాటుకున్నారు. తమ తల్లిదండ్రులు కేతమ్మ -- మల్లయ్య జ్ఞాపకార్థం ఈ వాహనాన్ని అందజేయడం విశేషం.

కష్టకాలంలో పేద కుటుంబాలకు ఊరట

కుటుంబంలో మరణం సంభవించినప్పుడు అంత్యక్రియల నిర్వహణతోపాటు పార్థివదేహాన్ని శ్మశానవాటికకు తరలించడం కూడా కుటుంబ సభ్యులకు ఆర్థికంగా, మానసికంగా భారంగా మారుతుంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు అంతిమ యాత్ర కోసం వాహనాన్ని ఏర్పాటు చేసుకునే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామ ప్రజలకు వైకుంఠ రథం అందుబాటులోకి రావడం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. మరణించిన వ్యక్తిని గౌరవప్రదంగా శ్మశాన వాటికకు తరలించేందుకు ఈ వాహనం ఉపయోగపడటమే కాకుండా, ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు గ్రామస్థాయిలో అండగా నిలిచే సామాజిక సేవా సాధనంగా నిలవనుంది. దాతలు మరో అడుగు ముందుకేసి గ్రామంలో ఏ కుటుంబంలోనైనా మరణం సంభవిస్తే అంతిమ యాత్రకు అవసరమైన డీజిల్ ఖర్చుల కోసం రూ.500 చొప్పున అందజేస్తామని ప్రకటించడం వారి సేవాభావానికి నిదర్శనం.

మాటలకే పరిమితం కాని సేవాభావం

పుట్టిన ఊరు కన్నతల్లితో సమానమని, ఆ గ్రామానికి తన వంతు సేవ చేయాలనే ఆలోచనతో వైకుంఠ రథాన్ని అందజేసినట్లు రాగి నాగరాజు తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన సమయంలో ఉపయోగపడే సేవ చేయడం తనకు సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు. గతంలోనూ గ్రామంలోని మసీదుకు గ్రిల్స్ ఏర్పాటు కోసం రూ.35 వేలు అందజేసినట్లు తెలిపారు. అలాగే మొదటి వార్డులో తన ఇంటి ఆవరణలోని గుంట స్థలాన్ని మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు కేటాయించినట్లు వివరించారు. భవిష్యత్తులోనూ గ్రామాభివృద్ధికి తనకు తోచిన ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

వ్యక్తిగత దాతృత్వం.. సామాజిక బాధ్యతకు ప్రతీక

ఒక గ్రామానికి వైకుంఠ రథాన్ని అందించడం అనేది కేవలం వాహనాన్ని బహూకరించడంతో ముగిసిపోయే కార్యక్రమం కాదు. మరణం వంటి విషాద సమయంలో బాధిత కుటుంబానికి అవసరమైన సేవను అందుబాటులోకి తీసుకురావడం, గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడే ఆస్తిని సమాజానికి అంకితం చేయడం ఇందులోని అసలైన ఉద్దేశం. తల్లిదండ్రుల జ్ఞాపకాలను సమాజానికి ఉపయోగపడే సేవతో ముడిపెట్టడం ద్వారా రాగి నాగరాజు -- సరిత దంపతులు ఆదర్శంగా నిలిచారు. ఇలాంటి కార్యక్రమాలు గ్రామాల్లో పరస్పర సహకార భావనను పెంపొందించడంతో పాటు, సంపన్నులు తమకు సాధ్యమైన రీతిలో సామాజిక సేవకు ముందుకు రావడానికి స్ఫూర్తినిస్తాయి. ప్రభుత్వ సేవలకు తోడుగా స్థానిక దాతలు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా ముందుకు వస్తే గ్రామాల్లో అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు సాధ్యమవుతాయి. ఈ నేపథ్యంలో ఇందుర్తి గ్రామానికి వైకుంఠ రథం అందజేయడం ఆదర్శనీయమైన సేవా కార్యక్రమంగా నిలిచింది.

దాతల దంపతులకు ఘన సన్మానం

ఈ సందర్భంగా రాగి నాగరాజు--సరిత దంపతులతో పాటు, తల్లి సాయవ్వ, అల్లుడు, కూతురు, కుమారుడిని గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారి సేవను అభినందిస్తూ, కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు ఈ సహాయం కొండంత భరోసాగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతపూల నరేందర్, ఉపసర్పంచ్ చింతపూల అనిల్, సింగిల్ విండో డైరెక్టర్లు చింతపూల సాయన్న, చిట్యాల బల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందె సురేష్, వార్డు సభ్యులు తోట లావణ్య, గట్టు లక్ష్మి, అందె బాబు, మాజీ సర్పంచ్ పుల్లూరి రాజు, మాజీ వార్డు సభ్యులు చెల్పూరి విష్ణుమాచారి, కూన మల్లయ్య, బండోజు రాజేందర్, తోట చంద్రయ్య, పర్షరాములు,లింగమూర్తి, అందే సదానందం,కిరణ్, కంది మల్లారెడ్డి, సంతోష్,మణికంఠ, గోకుల కొండ రవి, వెంకటేష్, విష్ణు,రవి, గుమ్మడి, బాలయ్య,జంగ కొమురయ్య తోపాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నారుగూడెంలో వైభవంగా బతుకమ్మ ముగింపు వేడుకలు..

- చివరిరోజు తిలకిస్తున్న మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు..
- నాయకులకు పూలతో ఘన స్వాగతం..



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)
దేవిశారన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ప్రధాన రహదారి పక్కన జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు సర్పంచ్ రోడ్ల ప్రభాకర్, ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ). మహిళలు ఆడుతున్న బతుకమ్మల ఆట పాటలను తిలకించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ సూదా హనుమంతరావు, గణేశుల ఆనందరావు, నాయకులు పెరసాని నరసింహారావు, తాళ్ళ అగస్టిన్, షేక్. యాకూబ్ పాషా, చింతల నరేష్, ఇస్సపల్లి పిచ్చయ్య, భద్రరావు, అమర్లపూడి భవాని, పడాల లక్ష్మణ్, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలి

- తొలి ప్రాధాన్యత ఓట్లతోనే విజయం సాధించాలి: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- అశ్వారావుపేటలో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం



భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / అక్టోబర్ 21 / అక్షరం న్యూస్ :త్వరలో జరగనున్న ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని శ్రీశ్రీ కళ్యాణ మండపంలో బుధవారం ఆయన అధ్యక్షతన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల ప్రచార ప్రణాళిక, పట్టభద్రులను కలవడం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు.

పట్టభద్రులను కలిసి పార్టీ విధానాలను వివరించాలి

ఈ సమావేశానికి ఖమ్మం లోక్‌సభ సభ్యుడు రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పట్టభద్రులను నేరుగా కలిసి కాంగ్రెస్ పార్టీ విధానాలను, అభ్యర్థి విజయ ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులన్నీ ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

వర్గ విభేదాలకు తావివ్వకుండా సమష్టి కృషి చేయాలి

పార్టీలో ఎలాంటి వర్గ విభేదాలకు తావివ్వకుండా వ్యక్తిగత అభిప్రాయాలను పక్కనపెట్టి అభ్యర్థి గెలుపునకు ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు సూచించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలు, ప్రచార సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కార్యకర్తల మధ్య సమన్వయం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. తొలి ప్రాధాన్యత ఓట్లతోనే విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

నాయకులకు సన్మానం

ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్, జల్లిపల్లి దేవరాజు, మాజీ సొసైటీ చైర్మన్ మొగళ్లపు చెన్నకేశవరావు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి, సత్యవరపు బాలగంగాధర్, బూసి పాండురంగారావు, కాసాని పద్మశేఖర్ తదితరులు శాలువాలతో సత్కరించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల పార్టీ బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌కు వెళ్లి అదృశ్యమైన ఇంటర్ విద్యార్థిని

- ఆచూకీ కోసం పోలీసుల గాలింపు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / అక్టోబర్ 21 / అక్షరం న్యూస్ :అశ్వారావుపేట మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మడకం అనూహ్య (16) అదృశ్యమైంది. ఈ నెల 12వ తేదీన స్పోర్ట్స్ మీట్ క్యాంపులో పాల్గొనేందుకు కొత్తగూడెం వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. బాలిక తల్లి మడకం శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశ్వారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

బాలిక వివరాలు..

అదృశ్యమైన బాలిక పేరు మడకం అనూహ్య. వయస్సు 16 సంవత్సరాలు, ఎత్తు సుమారు ఐదు అడుగులు, తెల్లని ఛాయ కలిగి ఉంది. తప్పిపోయిన సమయంలో నలుపు రంగు జీన్స్ ప్యాంట్, ఆరెంజ్, ఎరుపు రంగు కలిగిన టాప్ ధరించి ఉంది.

ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి

బాలిక ఆచూకీ తెలిసిన వారు లేదా ఆమెను ఎక్కడైనా గుర్తించిన వారు వెంటనే అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



పెద్ద ఏడిగిలో క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్.. విజేతలకు బహుమతులు అందించిన డాక్టర్ ఆనంద్ రావు





మద్నూర్ / అక్టోబర్ 21 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

జుక్కల్ నియోజకవర్గంలోని పెద్ద ఏడిగి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ బుధవారం ఉత్కంఠభరితంగా జరిగింది. జుక్కల్ మండలం హంగర్గ గ్రామానికి చెందిన ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ ఆనంద్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. డాక్టర్ ఆనంద్ రావు క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ విజేత బిచ్కుంద క్రికెట్ జట్టుకు షిల్డ్ తో పాటు 51,000 రూపాయలు, రెండవా బహుమతి ఏడిగి క్రికెట్ జట్టుకు షిల్డ్ తో పాటు 25,000 వేల రూపాయలు డాక్టర్ ఆనంద్ తన స్వంత డబ్బులు బహుమతి రూపంగా ఇవ్వడం జరిగింది.

ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ విజయం కోసం పోటీపడ్డారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు అస్పత్ వార్ వినోద్, మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, డాక్టర్ ఆనంద్ రావు క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి అండగా నిలిచారు. ఆటగాళ్లు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు అవసరమైన సహకారం అందించారు.

గెలుపోటములు సహజం.. క్రీడాస్ఫూర్తి ముఖ్యం

ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ రావు మాట్లాడుతూ.. గెలుపోటములు మానవ జీవితంలో సహజమని పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడిలో గెలవాలనే తపనతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, క్రీడాస్ఫూర్తి ఉండాలని సూచించారు. క్రీడలు యువతలో ఐక్యత, స్నేహభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని తమ ప్రతిభను వెలికితీయాలని ఆకాంక్షించారు.

టోర్నమెంట్‌లో విజయం సాధించిన జట్లకు డాక్టర్ ఆనంద్ రావు చేతుల మీదుగా షీల్డులతో పాటు నగదు బహుమతులను అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగియడంతో క్రీడాకారులు, నిర్వాహకులు, అభిమానుల్లో ఆనందం వ్యక్తమైంది.

సూర్య టీం ఈవెంట్ ఎక్కడ ప్లాన్ చేసిందో తెలుసా..?



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ 'సీన్' 47గా రాబోతున్న ఈ మూవీకి 'ఆవేశం' ఫేం జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా టైటిల్ టీజర్ కూడా రిలీజ్ చేయగా.. షార్ట్ అండ్ టీ షర్ట్‌లో నయా మేకోవర్‌లో కనిపిస్తూ స్టైలిష్ ఎంట్రీ ఇచ్చిఅదరగొట్టేస్తున్నాడు సూర్య. పోలీసాఫీసర్ భుజంపై చేయి వేసి జైలులో ఖైదీల మధ్య నుంచి నడుచుకుంటూ వస్తున్న సీన్లు.. మూవీలో సూర్యలోని నయా యాంగిల్‌ను చూపించబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తున్నాయి.ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేస్తున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషనల్ టైం వచ్చేసింది. సినిమా ప్రమోషనల్ ఈవెంట్‌ను ఈ సారి గ్రాండ్‌గా ప్లాన్ చేసింది సూర్య టీం. దుబాయ్‌లోని సిలికాన్ సెంట్రల్ మాల్‌లో గ్రాండ్ పబ్లిక్ ఈవెంట్‌ను నిర్వహించనుంది. అక్టోబర్ 25న సాయంత్రం 6 గంటల నుంచి ఈవెంట్ షురూ కానుంది. ఈవెంట్‌కు సూర్యతోపాటు చిత్రయూనిట్ సందడి చేయనుందట.ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ యువ నటుడు నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. విభిన్నమైన యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మలయాళ సంగీత దర్శకుడు సుశిన్ శ్యామ్ పనిచేస్తున్నాడు.

'దొంగ నా కొడుకు' టీజర్ విడుదల..

ఆకట్టుకుంటున్న మౌళి కామెడీ ఎంటర్‌టైనర్!

టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' నుంచి వస్తున్న తాజా చిత్రం 'దొంగ నా కొడుకు'. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. యూట్యూబ్‌లో మంచి క్రేజ్ ఉన్న మౌళి ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తుండగా, సుస్మితా శెట్టి నాయికగా నటిస్తోంది. శ్రీను కంబాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. విడుదలైన టీజర్‌ను గమనిస్తే.. ఇది వైజాగ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫన్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రంగా కనిపిస్తోంది. మౌళి తనదైన శైలి బాడీ లాంగ్వేజ్ మరియు కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమవుతున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో అలీ, రఘుబాబు కీలక పాత్రల్లో నటించబోతున్నారు.

హిందూశక్తి జాగృతంతోనే విశ్వకళ్యాణం





- ఆర్.ఎస్.ఎస్. విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్
- చొప్పదండి పట్టణంలో ఘనంగా రామలీల ఉత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- రాంలీలా 2026 ఉత్తమ సేవా పురస్కార్ అందుకున్న రామకృష్ణ సేవా సమితి

చొప్పదండి/ కరీంనగర్,అక్టోబర్ 21 (అక్షరం న్యూస్)చొప్పదండిలో మండల కేంద్రంలోని రాంలీల మైదానంలో హిందూ ఉత్సవ సమితి అధ్వర్యంలో నిర్వహించిన రాంలీల ఉత్సవంలో చిన్నారుల నృత్య బృందాలచే నిర్వ హించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.ఈ సందర్భంగా హిందూ శక్తి జాగృతంతో విశ్వ కళ్యాణం సాధ్యమవుతుందని ఆర్ ఎస్ ఎస్ విభాగ్(6జిల్లాలు) బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ అన్నారు. మంగళవారము రాత్రి స్థానిక చొప్పదండి ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన రామలీల ఉత్సవంలో ప్రధానవక్తగా పాల్గొని ఆయన ప్రసంగించారు. హైందవ శక్తి అంటేనే ధార్మిక శక్తి, సాత్విక శక్తుల సంగమం అని ఆయన వివరించారు. అసురీ శక్తుల పైన సాధించిన విజయానికి ప్రతీకగా త్రేతా,ద్వాపర యుగాలలో జరిగిన ధర్మ సంరక్షణను గుర్తుచేస్తూ విజయదశమిని జరుపుకుంటున్నామని చెప్పారు. భారతదేశం ప్రపంచంలోనే ప్రాచీన సంస్కృతి కలిగిన, మానవ జీవన విలువలను అందించే గొప్ప ధర్మము కలిగిన దేశమని పేర్కొన్నారు. హిందువులు ఐక్యత భారతదేశం కోసం మాత్రమే కాదని, ప్రపంచ శాంతి కోసం ఆయన అన్నారు. ప్రపంచంలోనే మానవులందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకునే ఏకైక ధర్మ హిందూ ధర్మం అని, ఏకైక వ్యక్తి హిందువు అని చెప్పారు. ప్రతి యుగంలో దైవీ,అసురీ శక్తుల మధ్యన సంఘర్షణ ఉంటుందని చెప్పారు. దేశభక్తి, దైవభక్తి రెండు కళ్ళలాంటివని అన్నారు.కళ్ళు మూసుకుంటే దైవం, కళ్ళు తెరిస్తే దేశం కనిపించాలని కోరారు. హిందువులు పంచ పరివర్తనలో భాగంగా సామాజిక సమరసత, స్వదేశీ,పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు, కుటుంబ జీవన విలువలను తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో త్వరలోనే విశ్వ గురువుగా ప్రపంచానికి మార్గదర్శనం చేసే స్థితికి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ హిందువులం ఐకమత్యంతో ఉండి దేశము, ధర్మము,సంస్కృతులను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అయన రామాబాణం సంధించి రావణ దహనం చేశారు. రాంలీలా మైదానం అంతా మీరుమిట్లు గోలిపే బాణాసంచా పేలుళ్ల మధ్య జై శ్రీరాం, రామలక్షణ జానకి, హరహర మహాదేవ శంభో శంకర, జై భవాని జై శివాజీ నినాదాలతో మార్మోగుతూ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షులు పడకంటి కృష్ణ, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ఎన్నం మునిందర్, రాంలీలా ఉత్సవ కన్వీనర్ కటకం మహేష్, కో కన్వినర్ మొలుమూరి రమేష్, వ్యవస్థ ప్రముఖ్ చేపూరి సత్యనారాయణ, కోశాధికారి దండె మహేష్, భజరంగ్ దళ్ జిల్లా భాద్యులు శంకర్, పట్టణ ప్రముఖ్ బత్తిని మురళి సభ్యులు దండె లింగన్న, దూస రాము, మంచికట్ల మల్లేష్, గుండెటి వెంకటరమణ, ఓరుగంటి విష్ణు, జిట్ట కుమార్, తాడూరి రామకృష్ణ, అనుకారి సాయి, గంగు సంపత్, కోటగిరి ప్రశాంత్, కళ్ళెం మనీష్ రెడ్డి, చల్ల అనుష్, ఆసిఫ్, అర్ధవెల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.





ఎన్టీపీసీలో దసరా వేడుకలు

వేడుకలను బహిష్కరించిన ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్.. తేదీ మార్పుపై అభ్యంతరం

జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : ఎన్టీపీసీ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో బుధవారం దసరా వేడుకలు నిర్వహించారు. రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫయాజ్ తయాబ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం స్థానిక కళాకారులు, నివాసితులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చివరగా రావణ దహనంతో వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఉద్యోగులు అధికారుల కుటుంబాలు హాజరయ్యాయి. దీప్తి మహిళా సమితి ప్రతినిధులు హాజరుకాగా, పూజా కమిటీ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. రామ్ లీలా నాటక ప్రదర్శన జరిగింది.

అయితే, ఈ వేడుకలను ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) బహిష్కరించింది. దసరా పండుగ ముగిసిన తర్వాత వేడుకలు నిర్వహించడంపై యూనియన్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా వేడుకల తేదీని మార్చడంపై విమర్శలు చేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ ల నాయకులు ఎవరూ హాజరుకాలేదు.

మురికి నీటిలో దుర్గామాత విగ్రహాల నిమజ్జనమా?

గోదావరిఖనిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాస్తారోకో.. అరగంట పాటు నిలిచిన వాహనాలు





జ్యోతినగర్, ఎన్టీపీసీ. అక్టోబర్ 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: గోదావరిఖనిలో దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి సరైన ఏర్పాట్లు చేయలేదని ఆరోపిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజించిన అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు మురికి నీటితో నిండిన కుంటను ఏర్పాటు చేయడంపై హిందూ సంఘాల ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.అమ్మవారి విగ్రహాలను మురికి నీటిలో నిమజ్జనం చేయలేమని వారు స్పష్టం చేశారు. నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేసే వరకు విగ్రహాలను కదిలించేది లేదని, చౌరస్తాలోనే ఉంచుతామని తేల్చిచెప్పారు. అధికారులు వెంటనే స్పందించి భక్తుల మనోభావాలను గౌరవించాలని డిమాండ్ చేశారు.సుమారు అరగంట పాటు కొనసాగిన రాస్తారోకోతో రాజీవ్ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. దీంతో రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఈసంపల్లి వెంకన్న విభాగ కార్యదర్శి అయోధ్య రవీందర్, ఆరెల్లి జలంధర్, అడిగొప్పుల రాజు, మూషిక సంపత్ యాదవ్‌తో పాటు హిందూ సమాజ ప్రతినిధులు, బీజేపీ నాయకులు సంధ్యారాణి సులువ లక్ష్మీ నరసయ్య పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌కు వెళ్లి అదృశ్యమైన ఇంటర్ విద్యార్థిని

ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / అక్టోబర్ 21 / అక్షరం న్యూస్ :అశ్వారావుపేట మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మడకం అనూహ్య (16) అదృశ్యమైంది. ఈ నెల 12వ తేదీన స్పోర్ట్స్ మీట్ క్యాంపులో పాల్గొనేందుకు కొత్తగూడెం వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. బాలిక తల్లి మడకం శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశ్వారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

బాలిక వివరాలు..



అదృశ్యమైన బాలిక పేరు మడకం అనూహ్య. వయస్సు 16 సంవత్సరాలు, ఎత్తు సుమారు ఐదు అడుగులు, తెల్లని ఛాయ కలిగి ఉంది. తప్పిపోయిన సమయంలో నలుపు రంగు జీన్స్ ప్యాంట్, ఆరెంజ్, ఎరుపు రంగు కలిగిన టాప్ ధరించి ఉంది.

ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి

బాలిక ఆచూకీ తెలిసిన వారు లేదా ఆమెను ఎక్కడైనా గుర్తించిన వారు వెంటనే అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

హర్మన్‌ప్రీత్ విధ్వంసం.. షఫాలీ సునామీ.. జింబాబ్వే సిరీస్ క్లీన్‌స్వీప్



క్రీజులో కుదురుకుంటే ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలే! బ్యాట్ ఝుళిపిస్తే బంతి బౌండరీ దాటాల్సిందే! భారత మహిళా క్రికెట్ జట్టు మూడో టీ20లో అదే జోరు చూపించింది. షఫాలీ వర్మ తనదైన దూకుడుతో ఇన్నింగ్స్‌కు పునాది వేస్తే.. హర్మన్‌ప్రీత్ కౌర్ సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడింది. ఇద్దరి మెరుపులతో పరుగుల వరద పారించిన టీమ్‌ఇండియా.. జింబాబ్వే ముందు 217 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. అనంతరం భారత బౌలర్లు ప్రత్యర్థిని కట్టడి చేయడంతో 96 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసి తమ ఆధిపత్యాన్ని చాటింది.

షఫాలీ జోరు.. హర్మన్ హోరు!

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే వికెట్ నష్టపోయినా.. షఫాలీ వర్మ దూకుడుతో ఇన్నింగ్స్ వేగం అందుకుంది. జింబాబ్వే బౌలర్లను లక్ష్యంగా చేసుకున్న ఆమె.. ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడింది. కేవలం 37 బంతుల్లోనే 69 పరుగులు సాధించింది. ఆమె ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. షఫాలీ దూకుడుతో భారత స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. మరోవైపు హర్మన్‌ప్రీత్ కౌర్ క్రీజులోకి వచ్చిన తర్వాత కథే మారిపోయింది. ఆరంభంలో ఆచితూచి ఆడిన ఆమె.. కుదురుకున్నాక జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడింది. బంతిని బౌండరీకి తరలిస్తూ, భారీ సిక్సర్లతో విరుచుకుపడింది. కేవలం 25 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న హర్మన్.. చివరి వరకు అదే జోరు కొనసాగించింది. 35 బంతుల్లో 81 పరుగులు చేసి భారత భారీ స్కోరులో కీలక పాత్ర పోషించింది. ఆమె ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. షఫాలీ, హర్మన్ దూకుడుతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది.

మేయర్స్ పోరాడినా.. ఫలితం శూన్యం!

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వేకు భారత బౌలర్లు ఆరంభంలోనే షాకిచ్చారు. క్రాంతి గౌడ్ తొలి బంతికే కెలిస్ ఎన్క్రోవును పెవిలియన్‌కు పంపింది. ఆ తర్వాత నందిని శర్మ.. మోడెస్టర్ ముపాచిక్వాను ఔట్ చేసి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. దీంతో జింబాబ్వే ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో షర్నే మేయర్స్, బెలవ్డ్ బిజా జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. మేయర్స్ ధాటిగా ఆడుతూ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. 49 బంతుల్లో 60 పరుగులు సాధించి అర్ధశతకంతో మెరిసింది. బిజా 50 బంతుల్లో 44 పరుగులు చేసి పోరాడింది. అయితే భారీ లక్ష్యం ముందు వారి ప్రయత్నం సరిపోలేదు. అవసరమైన రన్‌రేట్ పెరిగిపోవడంతో జింబాబ్వే ఒత్తిడిలో పడింది. మేయర్స్ ఔటైన తర్వాత జట్టు విజయంపై ఆశలు సన్నగిల్లాయి.

నందిని దెబ్బకు కుప్పకూలిన జింబాబ్వే

చివరి ఓవర్లలో భారత బౌలర్లు ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. నందిని శర్మ తన బౌలింగ్‌తో జింబాబ్వే పతనాన్ని వేగవంతం చేసింది. మూడు వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటింగ్ వెన్ను విరిచింది. క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, దీప్తి శర్మ తలో వికెట్ తీసి జట్టు విజయంలో భాగస్వాములయ్యారు. దీంతో జింబాబ్వే 20 ఓవర్లలో 6 వికెట్లకు 120 పరుగులే చేయగలిగింది. భారత్ 96 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుంది.

సిరీస్ భారత్‌దే.. అవార్డులు కూడా!

ఈ విజయంతో భారత్ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. బ్యాటింగ్‌లో షఫాలీ, హర్మన్‌ప్రీత్ మెరుపులు.. బౌలింగ్‌లో నందిని శర్మ సహా ఇతర బౌలర్ల సమష్టి ప్రదర్శన టీమ్‌ఇండియాకు తిరుగులేని విజయాన్ని అందించాయి. అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవగా.. సిరీస్ ఆసాంతం రాణించిన షఫాలీ వర్మ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డును అందుకుంది.

తుది జట్టులో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కడం కష్టమే: శ్రేయాస్ అయ్యర్



క్రైస్ట్‌చర్చ్ : న్యూజిలాండ్‌తో గురువారం నుంచి అయిదు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభంకానున్నది. దీని కోసం భారత బృందం క్రైస్ట్‌చర్చ్ చేరుకున్నది. అయితే ఈ సిరీస్‌లో యువ డాషింగ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తుది జట్టులో స్థానం సంపాదించే అవకాశాలు అనుమానంగా ఉన్నాయి. దీనిపై టీ20 కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ క్లారిటీ ఇచ్చాడు. ప్రస్తుతం భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారని, ఆ ఇద్దరి జోడీ చెలరేగి ఆడుతోందని, ఇలాంటి సమయంలో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కడం కష్టమే అవుతుందని కెప్టెన్ శ్రేయాస్ తెలిపారు. ఇటీవల ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌కు కూడా సూర్యవంశీని ఎంపిక చేశారు. కానీ గత 21 మ్యాచుల్లో అతను కేవలం 8 మ్యాచుల్లో మాత్రమే ఆడాడు. గత 21 మ్యాచుల్లో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఇద్దరూ రెగ్యులర్ ఓపెనర్లుగా రాణిస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఇండియా వరల్డ్‌కప్ గెలవడంలో ఈ టీ20 బ్యాటర్లు కీలక పాత్ర పోషించారు. సూర్యవంశీ లాంటి ట్యాలెంట్ ప్లేయర్లు డ్రెస్సింగ్ రూమ్ వద్ద గడపడం చాలా ముఖ్యమైన అంశం అవుతుందని, అతనికి అది సంతోషాన్ని ఇస్తుందని అయ్యర్ అన్నారు. అతను చాలా చిన్న వయస్కుడు అని, అవకాశాలు రావడానికి అతనికి ఇంకా చాల సమయం ఉందని, ప్రస్తుతం అతను నేరుగా జట్టులోకి రాలేడని, ఎందుకంటే మన ఓపెనర్లు నిలకడగా రాణిస్తున్నారని, వాళ్లు వరల్డ్‌కప్ గెలిచి పెట్టారని కూడా శ్రేయాస్ తెలిపారు. ఏషియన్ గేమ్స్‌లో మాత్రం సూర్యవంశీ బ్యాటింగ్ చేశాడు. దీని వల్ల ఆ టోర్నీలో శాంసన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. విదేశీ పిచ్‌లు, పరిస్థితులకు అలవాటుపడేందుకు ఇలాంటి టూర్లు సూర్యవంశీకి ఉపయోగపడుతాయని అయ్యర్ అన్నారు. అతను మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు, ఆ పరిస్థితుల్లో ఎలా ఇలాంటి పిచ్‌లపై ఆడాలో అతనికి అనుభవం వస్తుందన్నాడు. స్వదేశంలో ఫ్లాట్ పిచ్‌లపై ఆడిన తాము.. ఇక పేస్ ఫ్రెండ్లీ పిచ్‌లపై ఆడేందుకు సిద్ధం కావాలన్నారు. కివీస్‌లో ఉన్న కోల్డ్ వెదర్ కూడా తట్టుకోవాలన్నారు. ఇక్కడ పరిస్థితులను గమనిస్తే, వెదర్ ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలిస్తుందన్నాడు. న్యూజిలాండ్‌కు హోం అడ్వాంటేజ్ ఉంటుందన్నాడు. ఇషాన్ కిషన్ మూడవ నెంబర్‌లో బ్యాటింగ్ చేస్తున్నాడని, తానేమీ ఆర్డర్‌లో ముందు వెళ్లాలనుకోవడం లేదన్నాడు.

దసరా కానుకగా కూతురి ఫోటో షేర్ చేసిన దీపికా-రణవీర్.. పాప పేరు ఏదంటే?



బాలీవుడ్ స్టార్ కపుల్ దీపికా పదుకొనే, రణవీర్ సింగ్ తమ అభిమానులకు దసరా పర్వదినం సందర్భంగా అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు. తమ చిన్నారి రెండవ కూతురి ఫోటోను షేర్ చేయడంతో పాటు ఆ పాప పేరు 'దేవి పదుకొనే సింగ్' అని అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే ఈ దంపతులకు 'దువా' అనే మరో కూతురు ఉన్న విషయం తెలిసిందే. ప్రొఫెషనల్ లైఫ్ విషయానికి వస్తే, దీపికా షారుఖ్ ఖాన్ 'కింగ్' సినిమాతో పాటు అల్లు అర్జున్ సరసన 'రాకా' చిత్రంలో నటిస్తుండగా, రణవీర్ సింగ్ 'ధురంధర్' విజయాల జోరుతో పాటు కొత్తగా 'ప్రళయ్' అనే భారీ యాక్షన్ ప్రాజెక్ట్‌ను లైన్‌లో పెట్టారు. అటు పర్సనల్ లైఫ్, ఇటు కెరీర్‌పరంగా ఈ టాలెంటెడ్ కపుల్ ఫుల్ హ్యాపీ మూమెంట్స్‌ను ఎంజాయ్ చేస్తున్నారు.

స్ప్రింటర్ సిమ్రన్ శర్మకు రెండో గోల్డ్ మెడల్



నగోయా: స్ప్రింటర్ సిమ్రన్ శర్మ.. ఏషియన్ పారా గేమ్స్‌లో చరిత్ర సృష్టించింది. 100మీటర్ల టీ12 ఈవెంట్‌లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నది. సిమ్రన్ కేవలం 12.02 సెకన్లలో టార్గెట్‌ను ఫినిష్ చేసింది. ప్రస్తుత ఏషియన్ గేమ్స్‌లో సిమ్రన్‌కు ఇది రెండో గోల్డ్ మెడల్. మంగళవారం 200మీటర్ల టీ12 స్ప్రింట్ ఈవెంట్‌లోనూ సిమ్రన్‌కు స్వర్ణం దక్కిన విషయం తెలిసిందే. పారిస్‌లో జరిగిన పారాఒలింపిక్స్‌లో 100 మీటర్ల ఈవెంట్‌లో స్ప్రింటర్ సిమ్రన్ శర్మ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.ఇవాళ జరిగిన ఈవెంట్‌లో ఇరానీ అథ్లెట్ హజర్ సఫర్‌జాదే కన్నా బెటర్‌గా పర్ఫార్మ్ చేసింది. ఇరానీ అథ్లెట్ 12.30 సెకన్లలో టార్గెట్ ఫినిష్ చేసింది. ఇండోనేషియాకు చెందిన నీ పుత్రి 12.51 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నది. పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన సిమ్రన్ ప్రస్తుతం కొత్త ట్రైనర్ శివం వద్ద శిక్షణ పొందుతోంది. డోపింగ్ ఉల్లంఘన కేసులో మాజీ కోచ్ ఉమర్ సైఫీని బ్యాన్ చేసిన విషయం తెలిసిందే.2023లో హాంగ్‌జూలో జరిగిన ఏషియన్ పారా గేమ్స్‌లో సిమ్రన్ రెండు ఈవెంట్లలోనూ సిల్వర్ పతకాలు గెలిచింది. కంటిచూపుతో బాధపడేవారు టీ12 కేటగిరీలో పోటీపడుతుంటారు.

మెన్స్ షాట్‌పుట్‌లో సచిన్‌కు గోల్డ్.. భారత్ పోడియం స్వీప్



నగోయా: ఏషియన్ పారా గేమ్స్(ూంఱుఅ ్రాుతీుు +ుఎవం)లో భారత్ విజృంభిస్తోంది. మెన్స్ షాట్‌పుట్ ఎఫ్46 ఈవెంట్‌లో ఇండియా పోడియం స్వీప్ చేసింది. ఆ ఈవెంట్‌కు చెందిన మూడు మెడల్స్ ఇండియన్ అథ్లెట్లకే దక్కాయి. మెన్స్ షాట్‌పుట్‌లో సచిన్ ఖిలారి, మొహమ్మద్ యాసిర్, పర్వీన్ .. వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. పారాలింపిక్ మెడలిస్ట్ సచిన్.. ఏషియన్ గేమ్స్‌లో కొత్త రికార్డు క్రియేట్ చేశారు. షాట్‌పుట్‌ను 15.87 మీటర్ల దూరం విసిరి గేమ్స్‌లో కొత్త రికార్డును స్థాపించాడు. యాసిర్ 15.06 మీటర్లు, పర్వీన్ 14.94 మీటర్ల దూరం విసిరారు. పారిస్ పారాలింపిక్స్‌లో ఖిలారి సిల్వర్ మెడల్ గెలిచాడు. అయితే చైనాలో జరిగిన గత ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ కొట్టిన సచిన్ ఈసారి ఆ మెడల్‌ను డిఫెండ్ చేసుకున్నాడు. ఆరవ, ఏడవ అటెంప్ట్‌లో సచిన్ 15.87మీటర్ల దూరం విసిరి గేమ్స్ రికార్డు క్రియేట్ చేశాడు.మూడో రోజు కూడా ఇండియాకు పతకాల పంట పండుతోంది. ప్రస్తుతం భారత బృందం పతకాల పట్టికలో అయిదో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఇండియాకు 47 మెడల్స్ దక్కాయి. దీంట్లో 12 స్వర్ణాలు, 17 రజతాలు, 18 కాంస్య పతకాలు ఉన్నాయి.

ఇండియాలో వరల్డ్ కప్ టోర్నీకి పాకిస్తాన్ దూరం..

జట్టు పర్యటనకు అనుతివ్వని పీసీబీ

ఇండియాలో జరగబోయే క్రికెట్ వరల్డ్ కప్ టోర్నీకి పాకిస్తాన్ జట్టు దూరంగా ఉండనుంది. ఈ టోర్నీలో పాకిస్తాన్ పాల్గొనడం లేదని ఆ దేశానికి చెందిన పీవీసీఏ (పాకిస్తాన్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్) వెల్లడించింది. ఈ మేరకు టోర్నీ నిర్వాహకులకు సమాచారం అందించింది. పాకిస్తాన్ క్రికెట్ జట్టు ఇండియాలో పాల్గొనేందుకు అనుమతి కోరుతూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ).. ఆ దేశ విదేశాంగ శాఖకు విజ్ఞప్తి చేసింది. అయితే, ఇండియాలో జరిగే టోర్నీలో పాల్గొనేందుకు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి అనుమతివ్వడం లేదని పాక్ విదేశాంగ శాఖ మంత్రి, పీసీబీ చైర్మన్ మోసిన్ నఖ్వీ తెలిపారు. దీంతో పాక్ జట్టు ఈ పర్యటనకు రావడం లేదు. ఇండియాలో ఇంటర్నేషనల్ మాస్టర్స్ క్రికెట్ వరల్డ్ కప్ వచ్చే జనవరిలో జరగాల్సి ఉంది. ఇది 50 ఓవర్ల క్రికెట్. రెండేళ్లకోసారి ఈ టోర్నీ జరుగుతుంది. చివరగా గత ఏడాది శ్రీలంకలో ఈ టోర్నీ జరిగింది. ఈసారి ఇండియా ఆతిథ్యం ఇవ్వనుంది. ఇండియా-పాకిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచుల నిర్వహణ అంశం ఇంకా సందిగ్ధంగానే ఉంది. పాకిస్తాన్‌లో పర్యటించేందుకు భారత్ ఏమాత్రం సుముఖంగా లేదు. ఇదే సమయంలో పాకిస్తాన్ కూడా ఇండియా రావడానికి సిద్ధంగా లేదు. ఇరు జట్లూ తటస్థ వేదికలపై మాత్రమే మ్యాచులు ఆడుతున్నాయి. రాబోయే టోర్నీకి సంబంధించి పాకిస్తాన్ పర్యటించడం లేదని పీవీసీఏ చీఫ్ ఫవాద్ ఇజాజ్ తెలిపారు. ఇజాజ్ మాట్లాడుతూ.. ఈ టోర్నీలో పాల్గొనేందుకు పాకిస్తాన్ జట్టుకు వీసాలు మంజూరు చేస్తామని, ఉన్నతస్థాయి అదనపు భద్రత కల్పిస్తామని ఇండియా హామీ ఇచ్చిందని వెల్లడించారు. అయితే, తమ జట్టు ఇండియాలో పర్యటించేందుకు పాక్ ప్రభుత్వం అనుమతివ్వలేదని తెలిపారు.దీంతో తమ జట్టు స్థానంలో మరో జట్టును తీసుకోవాల్సిందిగా టోర్నీ నిర్వాహకులకు సూచించినట్లు వివరించారు. క్రికెట్ టీంతోపాటు పాక్ హాకీ టీం కూడా ఇండియాలో పర్యటించేందుకు విముఖత వ్యక్తం చేసింది. హాకీకి సంబంధించి ఆసియన్ ఛాంపియన్స్ ట్రోఫీ ఇండియాలో జరగాల్సి ఉంది. ఈ నెల 27 నుంచి టోర్నీ ప్రారంభం కావాలి. అయితే, ఈ టోర్నీలో పాల్గొనడం లేదని పాకిస్తాన్ హాకీ సమాఖ్య తెలిపింది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609